సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
శుక్రవారం । 20 । సెప్టెంబర్ । 2024



అధికార పార్టీనా..మజాకా!
ఇటీవల పచ్చ నేతల హడావుడి ఎక్కువైంది. అధికారిక హోదా లేనప్పటికీ తమ ద్వారానే అధికారిక కార్యక్రమాలు జరగాలని కొందరు పట్టుబడుతున్నారు. -8లో



మంచి ఆచారానికి నాంది
మహ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా ముస్లిం సోదరులు అద్భుతమైన ఆచారానికి నాంది పలికారని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. -8లో



ఎంబీబీఎస్ ఫలితాలు విడుదల
కడప ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల (రిమ్స్)లో 2023–24 సంవత్సరానికి ఫస్ట్ ఇయర్ ఎంబీబీఎస్ పరీక్ష ఫలితాలు విడుదల చేశారు. -8లో

న్యూస్‌రీల్

21న డయల్ యువర్ ఆర్‌ఎం

కడప కోటిరెడ్డిసర్కిల్: ఏపీఎస్ ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కార నిమిత్తం ఈనెల 21వ తేదిన డయల్ యువర్ ఆర్‌ఎం కార్యాలయాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి గోపాల్‌రెడ్డి తెలిపారు. శనివారం సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రయాణికులు 99592 25848 అనే నెంబరుకు ఫోన్‌గానీ, వాట్సాప్ చేసిగానీ సమస్యలను తెలియజేయవచ్చన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వేద విద్యార్థులకు నిరుద్యోగ భృతి

కడప కల్చరల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వేద విద్య చదివి ఎలాంటి ఉపాధి లేని వారికి ప్రభుత్వం నిరుద్యోగ భృతి అందజేయనుందని జిల్లా దేవదాయ ధర్మదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ సి.శంకర్ బాలాజీ తెలిపారు. అర్హులైన అభ్యర్థుల నుంచి ఈ మేరకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ఆయన తెలిపారు. దరఖాస్తులతోపాటు ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంటు, పాస్ పుస్తకం జిరాక్స్ కాపీలు పంపాలని సూచించారు. వేద విద్య పూర్తి చేసిన, ఉత్తీర్ణులైన సర్టిఫికెట్లు, నిరుద్యోగులమని సెల్ఫ్‌డిక్లరేషన్ ఫారంతోసహా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 25వ తేదీలోగా జిల్లా అసిస్టెంట్ కమిషనర్, దేవదాయ ధర్మదాయ శాఖ, వైఎస్సార్ పార్కువద్ద, రాజంపేట బైపాస్, పద్మావతినగర్, 3/2 సచివాలయం వద్ద, కడప అనే చిరునామాలో అందజేయాలని కోరారు. వేద విద్యలో క్రమాంతం, ఆపై కోర్సులు పూర్తి చేసి ఉత్తీర్ణుల సర్టిఫికెట్ పొందిన వారు మాత్రమే నెలకు రూ. 3 వేల నిరుద్యోగ భృతిని పొందేందుకు అర్హులని తెలిపారు. ఇతర వివరాలకు జనార్దన్ (99669 61554), నరసింహాసింగ్ (92909 41933)లను సంప్రదించాలని సూచించారు.

కాశినాయనవాసికి అరుదైన గుర్తింపు



ప్రొఫెసర్ కడియాల చంద్రబాబునాయుడు

కాశినాయన: అమెరికాలోని స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రకటించిన అత్యంత ప్రతిభావంతులైన టాప్–2024 శాస్త్రవేత్తల జాబితాలో వైఎస్సార్ జిల్లా కాశినాయన మండలం ఇటుగుల్లపాడు గ్రామానికి చెందిన కడియాల చంద్రబాబునాయుడు వరుసగా ఐదోసారి చోటు దక్కించుకున్నారు. వ్యవసాయ కుటుంబంలో పుట్టిన ఈయన మెటీరియల్ సైన్స్ విభాగంలో నిరంతరం పరిశోధనలతో డాక్టరేట్ పొందారు. 2018లో గీతం యూనివర్సిటీ బెంగళూరు క్యాంపస్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేరారు. మెటీరియల్ సైన్స్ విభాగంలోని పైరేట్స్, టైటానేట్స్, నాన్ కంపోజిట్ అనే అంశాలపై పరిశోధనలు కొనసాగించారు. 132 పరిశోధన పత్రాలు, 4 పుస్తకాలు, 2 పేటెంట్లు, 2 పీహెచ్‌డీలు సాధించారు. పరిశోధన పత్రాలను ప్రపంచ వ్యాప్తంగా ఉన్న పరిశోధనలకు అనుసరిస్తూ సూచించడంలో కడియాలకు గుర్తింపు లభించింది. 2019–20లో మొదటిసారిగా ర్యాంకును సాధించారు. 2020–21 లోనూ, 2021–22, 2022–23, 2023–24లలో ఉత్తమ ర్యాంకు సాధించారు. ఈ గుర్తింపుకు ప్రపంచ వ్యాప్తంగా ఉత్తమ స్థానం లభించింది. ప్రస్తుతం ఈయన గీతం యూనివర్సిటీ క్యాంపస్‌లో అసోసియేట్ ప్రొఫెసర్‌గా కొనసాగుతున్నారు.

జేఎన్టీయూ విద్యార్థులకు ఓరియంటేషన్



మాట్లాడుతున్న జెఎన్‌టీయూ ప్రిన్సిపల్ అరుణ కాంతి

పులివెందుల రూరల్: పట్టణంలోని జేఎన్‌టీయూ కళాశాలలో 2024– 2025 కొత్త విద్యా సంవత్సరానికి ప్రవేశం పొందిన మొదటి సంవత్సరం బీటెక్ విద్యార్థుల కోసం ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. గురువారం ఉదయం 10 గంటలకు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అరుణ కాంతి, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సుబ్బారెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అరుణ కాంతి మాట్లాడుతూ ఈ కళాశాలను 2006వ సంవత్సరంలో దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి ప్రారంభించారన్నారు. విద్యార్థులు కళాశాల వనరులను ఉపయోగించుకుని బాగా చదువుకుని కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలన్నారు. వైస్ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ సుబ్బారెడ్డి మొదటి సంవత్సరం విద్యార్థులకు సంబంధించిన ఆర్–23 రెగ్యులేషన్ సిలబస్, కళాశాల క్రమశిక్షణ, ఇంజనీరింగ్ విద్యపై అవగాహన కల్పించారు. అన్ని డిపార్ట్‌మెంట్లకు చెందిన విభాగాధిపతులు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

బాబు హామీలు.. నీటి బుడగలు!

- ఉక్కు ఫ్యాక్టరీ నిర్మాణంపై ఊసు లేదు నిరుద్యోగ సమస్య తీర్చింది లేదు..
- ప్రొద్దుటూరులో మెడికల్ కళాశాల ఎప్పుడో..
- జీఎన్ఎస్ఎస్ రెండోదశ పనుల మాటే కరువు
- రైతుల పంటల నిల్వకు కోల్డ్ స్టోరేజీలు ఏమయ్యాయో..!
- హార్టికల్చర్ హబ్ గాల్లో దీపమైంది..



సాక్షి ప్రతినిధి, కడప: చంద్రబాబు మాటల మనిషని.. గాల్లో మేడలు కట్టే మాయల మనిషని మరోసారి రుజువైంది. నోరు ఒకటి చెబితే, నొసలు మరొకటి చేసిందన్న చందంగా చంద్రన్న శైలి ఉంటుందన్న విశ్లేషకుల మాటే నిజమైంది. అవును.. ఆయన మాటలకు చేతలకు పొంతన లేకుండా ఉంటుందని... చెప్పింది చెప్పినట్లు ఆచరించిన చరిత్ర ఆయనకు అస్సలు లేదని రూఢీ అయింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల కోసం జిల్లా పర్యటనకు వచ్చిన చంద్రబాబు లెక్కలేనన్ని హామీలిచ్చారు. తాజాగా వంద రోజుల పాలన పూర్తి చేసుకున్న బాబు ఆ హామీల్నే మరిచారు.

- ప్రొద్దుటూరులో 350 పడకల ఆస్పత్రి ఉంది. అనుబంధంగా మెడికల్ కళాశాల కావాలని ఎన్నికల ప్రచారంలో టీడీపీ అభ్యర్థిగా వరదరాజులరెడ్డి కోరితే, ప్రొద్దుటూరుకు మెడికల్ కళాశాల మంజూరు చేస్తానని చంద్రబాబు ప్రకటించారు. మెడికల్ కళాశాల మాట అటుంచితే.. పులివెందులలో పూర్తయిన మెడికల్ కళాశాలను కొనసాగించలేమని.. మంజూరైన సీట్లే వద్దంటూ సీఎం హోదాలో నేషనల్ మెడికల్ కౌన్సిల్‌కు అధికారికంగా లేఖ రాశారు. ఇదీ.. చంద్రబాబు అసలు స్వరూపం.
- 'వినేవాడు లోకువ అయితే చెప్పేవాడు చంద్రబాబు' అనే నానుడి ఇప్పటికీ కొనసాగుతోంది. ఎన్నికల ప్రచారం, అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా ఇబ్బడి ముబ్బడిగా హామీలు గుప్పించడం, చెప్పిందే చెప్పడం, ఆచరణలో చూపెట్టకపోవడమే దీనికి కారణమని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. కడపలో ఉక్కుఫ్యాక్టరీ ఏర్పాటు చేస్తామని, రెండునెలల్లో కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోకపోతే తామే నిర్మించి తీరుతామని 2018లో సీఎం హోదాలో ప్రకటించారు. జిల్లాను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతామని, హార్టికల్చర్ విశ్వవిద్యాలయం నెలకొల్పుతామని, టూరిజం సర్క్యూట్ ఏర్పాటు చేస్తామని, రూ.100 కోట్లతో మెగా ఫుడ్‌పార్క్, టెర్మినల్ మార్కెట్ నెలకొల్పుతామని, ఉర్దూ యూనివర్శిటీ స్థాపిస్తామని ఇలా అనేక హామీలను 2014–19 హయాంలో చంద్రబాబు ప్రకటించారు. ఆచరణలో అమలు చేయలేయకపోగా, ప్రచార ఆర్భాటాలకే పరిమితమయ్యారు.

జీఎస్ఎస్ఎస్ రెండోదశ పనుల ఊసేదీ!

గాలేరు–నగరి సుజల స్రవంతి పథకం ద్వారా జిల్లాలో 1.65లక్షల ఎకరాల ఆయకట్టుకు నీరు ఇవ్వాలనే సంకల్పం. తొలిదశ పనుల్లోని రిజర్వాయర్లను దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి దాదాపు పూర్తి చేశారు. ఆ పనులు పూర్తి కోసం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సర్కార్ విశేషంగా కృషి చేసింది. పైగా జీఎస్ఎస్ఎస్, హెచ్ఎన్ఎస్ఎస్ అనుసంధానం చేయాలనే దిశగా అడుగులు వేశారు. ఆ పనులను కూడా కొనసాగించలేని దుస్థితిలో చంద్రబాబు సర్కార్ ఉండిపోయింది. ఎన్నికల హామీగా జీఎస్ఎస్ఎస్ రెండవ దశ పనులు కూడా కొనసాగిస్తామని చెప్పుకొచ్చిన ఆయన చిత్తశుద్ధి చూపెట్టడంలో విఫలమయ్యారని నిపుణులు వివరిస్తున్నారు.

కలగా మిగిలిన హార్టికల్చర్ హబ్...

రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా తీర్చిదిద్దుతాం. బిందు సేద్యం నిర్వహణకు 90శాతం సబ్సిడీ ఇస్తాం. రాయలసీమకు సాగునీటి సమస్యను తీర్చుతాం. ఇలాంటి మాటలు 1995 నుంచి చంద్రబాబు చెబుతూనే ఉన్నారు. అవే ఇప్పటికీ రిపీట్ అవుతున్నాయి. టూరిజం సర్క్యూట్, హార్టికల్చర్ హబ్ ఏర్పాటు కలగానే మిగిలిపోయింది.

మెడికల్ కళాశాలకు చంద్రగ్రహణం

కొండ నాలుకకు మందు వేస్తే, ఉన్న నాలుక ఊడినట్లుగా ప్రొద్దుటూరుకు మెడికల్ కళాశాల కావాలని కోరితే, మంజూరు చేస్తానని ప్రకటించిన చంద్రబాబు పూర్తి అయిన పులివెందుల మెడికల్ కళాశాల నిర్వహణ కొనసాగించలేమని సీఎం హోదాలో తేల్చి చెప్పారు. 650 పడకల ఆస్పత్రి అందుబాటులో ఉంది. వైద్య కళాశాల నిర్వహణకు ఫ్యాకల్టీ సిద్ధంగా ఉంది. ఎన్ఎంసీ 50 ఎంబీబీఎస్ సీట్లు మంజూరు చేసింది. అయినప్పటికీ చంద్రబాబు సర్కార్ చేతులేత్తేసింది. ఈప్రాంతంపై ఆయనకున్న వ్యతిరేకతే అందుకు ప్రధాన కారణమని విశ్లేషకులు వివరిస్తున్నారు.

ఉక్కు ఫ్యాక్టరీకి అసలు అడ్డంకి చంద్రబాబే

వైఎస్సార్ జిల్లాలో ఉక్కుపరిశ్రమ స్థాపనతో ప్రత్యక్షంగా 20వేల మందికి, పరోక్షంగా లక్ష మందికి జీవనోపాధి అవకాశాలు కల్పించాలని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి సంకల్పించారు. 10మిలియన్లు సామర్థ్యంతో రూ.20వేల కోట్లు అంచనా వ్యయంతో బ్రహ్మణీ స్టీల్స్‌కు 2007 జూన్10న పునాది రాయి వేశారు. అప్పట్లో సుమారు రూ.1500 కోట్లతో వివిధ నిర్మాణపనులు పూర్తయ్యాయి. అంతలోనే ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మృతి చెందడంతో బ్రహ్మణీ స్టీల్స్‌కు చంద్రగ్రహణం పట్టింది. రాష్ట్ర విభజన బిల్లులో సెయిల్ నేతృత్వంలో ఉక్కుపరిశ్రమ నెలకొల్పుతామని కేంద్ర ప్రభుత్వం ఆమోదం ప్రకటించింది. పార్లమెంటు ఆమోదం మేరకు పరిశ్రమ చేపట్టాలని ప్రజలు ఉద్యమాలు చేపట్టారు. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా వైఎస్సార్‌సీపీ, వామపక్షాలు, ప్రజా సంఘాలు, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీలు ఆందోళనను ఎంచుకున్నాయి. అప్పట్లో బీజేపీ, తెలుగుదేశం పార్టీలు మాత్రమే ప్రజాభిప్రాయానికి భిన్నంగా ప్రజాందోళనకు దూరంగా ఉండిపోయాయి. బ్రహ్మణీ స్టీల్స్‌కు నిర్మాణానికి పరోక్షంగా ప్రత్యక్షంగా చంద్రబాబే పెద్ద అడ్డంకిగా నిలిచారనే పలువురు ఆరోపిస్తున్నారు.

హామీలు నెరవేర్చే అలవాటు 'బాబు'కు లేదు



హామీలు ఇవ్వడమే తప్ప వాటిని నెరవేర్చే అలవాటు సీఎం చంద్రబాబుకు లేదు. జిల్లాకు సంబంధించిన సాగునీటి ప్రాజెక్టులు తమ హయాంలోనే పూర్తి చేస్తామని గతంలో హామీ ఇచ్చి నెరవేర్చలేదు. ముంపు పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా విస్మరించారు. రాష్ట్ర స్టీల్ అథారిటీ ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వ నిధులతో కంబాలదిన్నె వద్ద ఉక్కు ఫ్యాక్టరీ నిర్మిస్తామని చెప్పి మాట తప్పారు. బుగ్గవంక రక్షణ గోడ నిర్మిస్తామని విస్మరించారు. **– చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి, సీపీఎం**

బాబువి గాలి మాటలు



అవసరమైతే గండికోట ప్రాజెక్టు కాలువలపై నిద్రించి దాన్ని పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరిస్తామని చెప్పి ఆ ప్రాజెక్టులు పూర్తి చేయకుండా నిర్లక్ష్యం వహించిన చరిత్ర బాబుది. గాలేరు–నగరి, హంద్రీ–నీవా, రాజోలి వంటివి చంద్రబాబు ప్రాధాన్యతల్లో లేవు. కేంద్రం ఉక్కు ఫ్యాక్టరీ నిర్మించకపోతే తానే చేపడతానంటూ 2019 ఎన్నికలకు ముందు శిలాఫలకం వేసి దాన్ని పట్టించుకోలేదు. రైల్వేకోడూరును హార్టికల్చర్ హబ్‌గా మారుస్తానని చెప్పి అమలు చేయలేదు. **– గాలి చంద్ర, జిల్లా కార్యదర్శి, సీపీఐ.**

చంద్రబాబు అబద్ధాల కోరు



నిజం చెబితే తలముక్కలైతోందనే శాపం చంద్రబాబుకు వెంటాడుతోంది. ఆయన రాజకీయ జీవితమంతా అబద్ధాలమయమే. ఏనాడు కూడా చెప్పింది చేయలేదు. ఎన్నికల ముందు ఒకమాట, తర్వాత మరోమాట ఎత్తుకోవడం సర్వసాధారణం. ప్రజలకిచ్చిన హామీలు నెరవేర్చాలి. జిల్లాలో రెండోదశ జీఎన్ఎస్ఎస్ పనులు కొనసాగిస్తామని చెప్పారు. ఆదిశగా అడుగులు పడలేదు. చంద్రబాబును నమ్మి ప్రజలు మరోమారు మోసపోయారు. **–రవీంద్రనాథరెడ్డి, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌సీపీ.**

జిల్లా ఆర్థికాభివృద్ధికి ప్రణాళిక

కలెక్టర్ శివశంకర్

కడప సెవెన్‌రోడ్స్: స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్–2047 లక్ష్యాలకు అనుగుణంగా జిల్లా ఆర్థికాభివృద్ధికి ప్రణాళిక రూపొందించుకుని వాటి సాధనకు అవసరమైన కార్యచరణ సిద్ధం చేయాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి అధికారులను ఆదేశించారు. గురువారం రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ నీరబ్‌కుమార్ ప్రసాద్ కలెక్టర్లతో వర్చువల్ విధానంలో ఈ అంశంపై సమీక్ష నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ రానున్న ఐదేళ్లలో జిల్లాలో అభివృద్ధి చేసేందుకు ఆయా శాఖలు ప్రణాళికలు రూపొందించాలన్నారు. జిల్లా విజన్ యాక్షన్ ప్లాన్ రూపొందించి వచ్చేనెల 15వ తేది తమకు నివేదించాలన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్లు ఈనెల 30వ తేదీ నాటికి విజన్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలన్నారు. కొప్పర్తి పారిశ్రామికవాడలో ఉన్న 6900 ఎకరాల్లో పారిశ్రామికాభివృద్ధి ప్రణాళికలు రూపొందించాలన్నారు.



వీసీలో పాల్గొన్న కలెక్టర్, జేసీ తదితరులు

వంద రోజుల ప్రగతి వివరించాలి

రాష్ట్ర ప్రభుత్వం ఈ వంద రోజుల్లో సాధించిన ప్రగతి గురించి అధికారులు ప్రజలకు వివరించాలని కలెక్టర్ శివశంకర్ లోతేటి ఆదేశించారు. ఇది మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో విజయవంతం చేయాలన్నారు. ఈనెల 20 నుంచి 26వ తేదీ వరకు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో గ్రామ సభలు నిర్వహించాల్సి ఉంటుందన్నారు.

ఇసుక బుకింగ్ సులభతరం

కొత్త ఇసుక పాలసీ ప్రకారం ఇసుకను ఉచితంగా, సులభంగా బుక్ చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం పోర్టల్ అందుబాటులోకి తీసుకువచ్చిందని, ఈ సదుపాయాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కలెక్టర్ శివశంకర్ తెలిపారు. ఇసుకను ఇంటి వద్దకే సరఫరా చేసే సదుపాయం కూడా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చిందన్నారు. రవాణా, నిర్వహణ ఖర్చులు మాత్రం వినియోగదారులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. హెచ్‌టీటీపీఎస్://డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఎస్ఏఎన్‌డీ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 వరకు ఇసుక బుకింగ్ చేసుకునే సదుపాయం ఉంటుందని, కేవలం ఆన్‌లైన్ పేమెంట్లకు మాత్రమే చేయాలన్నారు. ఇసుక రవాణా చేసే వాహనదారులకు రవాణా రుసుమును ప్రభుత్వం నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తుందన్నారు. సందేహాలకు 1800 425 6037 టోల్‌ఫ్రీ నెంబర్లకు కాల్ చేసి నివృత్తి చేసుకోవాలని సూచించారు.

పసికందును దాచిన తండ్రి

నిలదీసిన భార్య... భర్తపై కేసు నమోదు

కడప అర్బన్: ఒకటి రెండు కాదు మూడు నెలలుగా పసికందును తల్లికి చూపించకుండా తండ్రే దాచిపెట్టిన ఘటన వెలుగుచూసింది. వివరాల్లోకి వెళితే.. వల్లూరుకు చెందిన మణికంఠ.. వీరపునాయునిపల్లెకు చెందిన మౌనిక వరుసకు బంధువులవుతారు. మౌనిక కడపలో నర్సింగ్ చదువుతోంది. ప్రేమించుకున్న వీరిద్దరు ఏడాదిన్నర క్రితం పెద్దలకు తెలీకుండా వివాహం చేసుకున్నారు. ఈ క్రమంలో ఈ ఏడాది జూన్ 13న కడపలోని చిన్నచౌక్ పరిధిలోని అప్సరా సర్కిల్ సమీపంలోట హాస్పిటల్‌లో మౌనిక పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. మణికంట మరుసటి రోజున మౌనికను, పసికందును బాలాజీనగర్‌లో తన స్నేహితుడు శ్రీనివాసులు ఇంటిలో ఉంచాడు. ఆపై తన కుమార్తెను డాక్టర్ దగ్గరికి తీసుకుని వెళ్లి వస్తానని చెప్పి ఇందిరా నగర్‌లోని తమ బంధువుల సంరక్షణలో ఉంచాడు. పాపను బంధువుల ఇళ్ల దగ్గర ఉంచాననీ, డాక్టర్ దగ్గర చూపిస్తున్నానని తన భార్యకు నచ్చచెబుతూ వచ్చాడు. ఈ క్రమంలో మౌనిక భర్త మణికంఠను



మూడు నెలల చిన్నారిని తల్లి మౌనికకు అప్పగిస్తున్న ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది

నిలదీయడంతో పాటు తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో భర్త మణికంఠ, మరికొందరిపై కేసు నమోదు చేసిన కడప తాలూకా సీఐ జి. వెంకటేశ్వర్లు, తమ ఎస్ఐ తాయర్‌హుసేన్ ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభించారు. ఒకే గోత్రం కావడంతో తమ వివాహాన్ని బంధువులు, కుటుంబసభ్యులు అంగీకరించరనీ మణికంఠ పోలీసుల దర్యాప్తులో తెలియజేశాడు. దీంతో అధికారులు మూడునెలల చిన్నారిని సీడబ్ల్యూసీ అధికారుల ముందు అప్పగించారు. తరువాత వారు ఐసీడీఎస్ అధికారులతో కలిసి భార్యాభర్తలకు కౌన్సెలింగ్ నిర్వహించి మౌనికకు పసికందును అప్పగించారు. ఈ సంఘటనపై అధికారులు సమగ్రంగా విచారిస్తున్నారు.

హతవిధీ.. హోమియోపతి!

కూటమి ప్రభుత్వంలో అభివృద్ధి కుంటుపడింది. ముఖ్యంగా వైద్యరంగం పూర్తిగా పడకేసింది. కడపలో ప్రభుత్వ హోమియోపతి మెడికల్ కళాశాల నిర్మాణ పనులు ఆగిపోవడమే ఇందుకు సాక్ష్యం. వైఎస్సార్‌సీపీ పాలనలో చురుగ్గా జరిగిన పనులు..కూటమి ప్రభుత్వం రాకతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లు ఆగిపోయాయి. హోమియోపతి మెడికల్ కాలేజీ కొత్త భవన నిర్మాణం పనులు ప్రశ్నార్థకంగా మారాయి.

- ప్రశ్నార్థకంగా కాలేజీ కొత్త బిల్డింగ్ నిర్మాణం
- 'ఆయుష్' యూనివర్శిటీపై కూడా నీలి నీడలు
- ఆ పనులు ఆగేనా..సాగేనా..?





కడప పాత రిమ్స్‌లో హోమియోపతి మెడికల్ కాలేజీ కొత్త భవనాలకు కేటాయించిన స్థలం, కడప మరియాపురం ప్రాంతంలో ఉన్న ప్రభుత్వ హోమియోపతి మెడికల్ కాలేజీ

కడప రూరల్: రాయలసీమకు కడప కేంద్రంగా మరియాపురం ప్రాంతంలో 1982లో ప్రభుత్వ హోమియోపతి మెడికల్ కాలేజీ ప్రారంభమైంది. అనుసంధానంగా నగర పరిధిలో ప్రభుత్వ ఆసుపత్రి కూడా ఏర్పడింది. ప్రస్తుతం ఈ ఆసుపత్రి పాత రిమ్స్‌లోని నూతన భవనంలో కొనసాగుతోంది. ఈ మెడికల్ కాలేజీ కడప నగరానికి కాస్త దూరంలో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో మెడికల్ కాలేజీ కూడా ఆసుపత్రికి అనుసంధానంగా దగ్గరలో ఉంటే ప్రయోజనంగా ఉంటుందని కొంత మంది భావించారు. ఈ అంశాన్ని ఆయుష్ కమీషనర్ డాక్టర్ రాజేంద్రప్రసాద్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన మార్చి నెలలో ఇక్కడికి వచ్చి ఆసుపత్రిని పరిశీలించారు. ఈ ఆసుపత్రికి ఎదురుగా ఉన్న స్థలంలో మెడికల్ కాలేజీకి కొత్త భవనాన్ని నిర్మిస్తే బాగుంటుందని ప్రభుత్వానికి సూచించారు. ఆ మేరకు ప్రభుత్వం 50 సెంట్ల స్థలాన్ని కేటాయించింది. నాటి ప్రభుత్వ ఆదేశాల మేరకు హోమియోపతి మెడికల్ కాలేజీ కొత్త భవనాలకు కేటాయించిన స్థలంలో ఉన్న పాడుబడిన భవనాలను తొలగించారు.

అనుసంధానంతో ప్రయోజనాలు...

ఈ ఆసుపత్రికి అనుసంధానంగా దగ్గరలోనే మెడికల్ కాలేజీ భవనం నిర్మితమైతే అటు కాబోయే వైద్యులకు ఇటు రోగులకు సౌలభ్యంగా ఉంటుంది. మెడికల్ కాలేజీ విద్యార్థులు తమ కోర్సును అభ్యసించడంలో భాగంగా ఆసుపత్రికి వచ్చే రోగులను పరీక్షించాల్సి ఉంటుంది. అంటే మరియాపురం ప్రాంతంలో ఉన్న మెడికల్ కాలేజీ నుంచి నగరంలో పాత రిమ్స్‌లో ఉన్న ఆసుపత్రికి రావాలంటే చాలా కష్టంతో కూడుకున్న పని.

టీడీపీ ప్రభుత్వం నిర్ణయంపై సందిగ్ధం...

మొదట 50 సెంట్ల స్థలంలో కొత్త భవనాల నిర్మాణాలకు రూ.5 కోట్లు సరిపోతుందని భావించారు. ఆ మేరకు నాటి రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రూ.5 కోట్ల నిధులను కూడా మంజూరు చేశారు. అయితే కడపలోని ఏపీ ఎంఎస్ఐడీసీ (ఆంధ్రప్రదేశ్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్) వారు నిర్మాణాలకు రూ.24 కోట్లు అవుతుందని అంచనా వేశారు. ఆ లోపే ఎన్నికల కోడ్ రావడంతో ఆ పనులు అంతటితో ఆగిపోయాయి. ఎన్నికల తరువాత టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడింది. అంతే ఇప్పటికీ పనులు ముందుకు జరగలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వైద్య రంగం అభివృద్ధి పరుగులు తీస్తే.. టీడీపీ ప్రభుత్వం పాలనలో ఎప్పట్లాగే 'చంద్రగ్రహణం' పట్టింది.

ఇప్పుడా అసౌకర్యానికి అడ్డుకట్ట పడనుంది. కాగా ఈ మెడికల్ కాలేజీలో ప్రతి ఏటా ఒక ఏడాదికి ఒక బ్యాచ్‌కు నాలుగున్నర సంవత్సరాల కోర్స్‌కు 38 మంది బీహెచ్ఎంఎస్ (బ్యాచులర్ ఆఫ్ హోమియోపతి మెడిసిన్ అండ్ సర్జన్) కోర్స్‌కు సంబంధించి యూజీ (అండర్ గ్రాడ్యుయేట్స్), మూడేళ్ల కోర్స్‌కు సంబంధించి 8 మంది పీజీ స్టూడెంట్స్ హోమియోపతి వైద్య విద్యను అభ్యసిస్తుంటారు.

'ఆయుష్' యూనివర్శిటీ వస్తుందా..

కడపకు ప్రతిష్టాత్మకమైన 'ఆయుష్' యూనివర్శిటీ వచ్చే అవకాశం ఉందని ఇదివరకు ఆ శాఖ అధికారులు అభిప్రాయాలు వ్యక్తం చేశారు. ఆయుష్ పరిధిలోకి ఆయుర్వేదం, యోగా, యునాని, సిద్ధ యోగ, హోమియోపతి విభాగాలు వస్తాయి. ఈ ఆయుష్ యూనివర్శిటీ ఏర్పాటు వలన అన్ని విభాగాలకు చెందిన పరిపాలనా అంశాలు ఉంటాయి. అలాగే ఆయుష్‌కు సంబంధించి మందుల తయారీ యూనిట్ ఏర్పాటుకు ఆస్కారం ఉంటుంది. ఈ యూనివర్శిటీ ఏర్పాటు పరిశీలనకు అందుకు సంబంధించిన ఉన్నతాధికారులు ఆరు నెలల క్రితం కడపకు వచ్చి పరిశీలించి సానుకూలత వ్యక్తం చేశారు. కాగా దేశంలో ఇప్పటి వరకు ఆయుష్ ప్రభుత్వ యూనివర్శిటీ గుజరాత్‌లోని గోరఖ్‌పూర్‌లో మాత్రమే ఉంది. ప్రైవేట్ రంగానికి సంబంధించి 13 యూనివర్శిటీలు ఉన్నాయి. ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో ఈ యూనివర్సిటీ రాకపైనా నీలినీడలు కమ్ముకున్నాయి. ప్రభుత్వం త్వరగా స్పందిస్తేనే ఫలితం ఉంటుందని.. ఉదాసీనంగా వ్యవహరిస్తే నష్టం వాటిల్లుతుందని ఆ శాఖకు చెందిన వైద్యులు, ఉద్యోగులు అంటున్నారు.

ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాం

హోమియోపతి మెడికల్ కాలేజీ కొత్త భవనాల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించాం. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం నడుచుకుంటాం.
– డాక్టర్ సాంబమూర్తి, ప్రిన్సిపల్, ప్రభుత్వ హోమియోపతి మెడికల్ కాలేజీ, కడప

అంశాలను పరిశీలిస్తాం

నేను ఇటీవలే ఇక్కడ బాధ్యతలను స్వీకరించాను. ఇందుకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించాల్సి ఉంది. అధికారులను అడిగి పూర్తి స్థాయి సమాచారం తెలుసుకుంటాను.
– శ్రీనివాసులురెడ్డి, ఈఈ, ఏపీ ఎంఎస్ఐడీసీ, కడప.

క్లుప్తంగా

పవర్ లిఫ్టింగ్ పోటీలో 16 పతకాలు


పతకాలు సాధించిన పవర్ లిఫ్టింగ్ జట్టుతో డైరెక్టర్, అధ్యాపకులు

వేంపల్లె : ఇడుపులపాయ ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీలో చదువుతున్న విద్యార్థులు రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో పాల్గొని 16 పతకాలు సాధించినట్లు డైరెక్టర్ కుమారస్వామి గుప్తా తెలిపారు. ఈనెల 14, 15 తేదీల్లో అమలాపురంలో జరిగిన రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో తమ కళాశాల విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచి పతకాలను సాధించారన్నారు.

అలాగే రెండు టీంలలో ఛాంపియన్ షిప్‌లను కైవసం చేసుకున్నారన్నారు. పతకాలు సాధించడం పట్ల డైరెక్టర్‌తోపాటు అకడమిక్ డీన్ రత్నకుమారి, అధ్యాపక బృందం, కోచ్ బాల గోవింద తివారి, పీడీలు ఓబయ్య, శంషాద్ బేగం తదితరులు విద్యార్థులను అభినందించారు.

నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి


బాధిత విద్యార్థిని పరామర్శిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి కారణమైన నారాయణ విద్యా సంస్థలపై చర్యలు చేపట్టాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. నగరంలోని హరి టవర్స్ దగ్గర ఉన్న నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థి చైతన్య ఆత్మహత్యాయత్నం చేయగా బాధిత విద్యార్థిని కడప రిమ్స్‌కు తరలించారు.

దీంతో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరపోగు రవి తదితరులు బాధిత విద్యార్థిని పరామర్శించారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ వైస్ ప్రిన్సిపల్, సిబ్బంది తిట్టడం, కొట్టడం వల్ల ఆ అవమానాన్ని భరించలేక చైతన్య విషద్రావణం తాగాడన్నారు. విద్యార్థి ఆరోగ్యం విషమంగా ఉందన్నారు. కనీసం విద్యార్థి ఆరోగ్యం గురించి జిల్లా విద్యాశాఖ అధికారులు ఏమాత్రం చొరవ చూపలేదన్నారు. బాధిత విద్యార్థికి మెరుగైన వైద్యం అందించాలని, ఆత్మహత్యా యత్నానికి కారణమైన నారాయణ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

వేడుకగా యువజనోత్సవం

కడప స్పోర్ట్స్ : యువజన సర్వీసులశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవాలు గురువారం వేడుకగా సాగాయి. కడప నగరంలోని స్పిరిట్స్ విద్యాసంస్థల్లో నిర్వహించిన ఈ ఉత్సవాలను డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ఆర్ట్స్ విశ్వవిద్యాలయం వైస్ చాన్సలర్ ఆచార్య జి. విశ్వనాథకుమార్, బీసీ కార్పొరేషన్ ఈడీ డాక్టర్ వల్లూరు బ్రహ్మయ్య, స్టెప్ సీఈఓ సి. సాయిగ్రేస్, నెహ్రూ యువకేంద్రం కోఆర్డినేటర్ మణికంఠ ప్రారంభించారు. తొలుత స్వామి వివేకానందుని చిత్రపటానికి పూలమాల వేసిన అనంతరం జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యువత తమలోని నైపుణ్యాలను ప్రదర్శించేందుకు చక్కటి వేదిక యువజనోత్సవాలు అని పేర్కొన్నారు. డాక్టర్ బ్రహ్మయ్య మాట్లాడుతూ యువత తలుచుకుంటే సాధించలేనిది లేదన్నారు. స్టెప్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అతిథులు

సీఈఓ సి. సాయిగ్రేస్ మాట్లాడుతూ జనవరి 12న స్వామి వివేకానందుని జయంతి వేడుకలు పురస్కరించుకుని రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనంతరం నెహ్రూ యువకేంద్రం కోఆర్డినేటర్ మణికంఠ, కళాశాల డైరెక్టర్ రవీంద్ర, స్థానిక 16వ డివిజన్ కార్పొరేటర్ లక్ష్మిదేవి మాట్లాడారు. అనంతరం వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి విజేతలను ప్రకటించారు. కార్యక్రమంలో స్టెప్ మేనేజర్ వి.వి. సుబ్బారాయుడు, సిబ్బంది నారాయణ, నాగయ్య, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

విజేతల వివరాలు..
(ప్రథమ, ద్వితీయస్థానాలు వరుసగా)
కవిత్వం : బి. దస్తగిరి, ఎస్. సురేఖ
డెక్లమేషన్ : ఎస్. సమీన, ఎస్. ఆర్షియాఅహ్మద్
స్టోరీ రైటింగ్: ఎస్.సానియా, ఎస్. జెబా
పెయింటింగ్: వి.హరినాయక్, టి.చంద్రభాను
ఫోక్ డాన్స్ (గ్రూప్): పెయ్యల యశ్విత టీం, జయచంద్ర టీం
ఫోక్ డాన్స్ (సోలో): ఎన్. ఉషోదయ, టి. సుధేష్ణ
ఫోక్ సాంగ్ (సోలో): కె. మురళీమోహన్, డి. అనూష,
ఫోక్ సాంగ్ (గ్రూప్): ఎం. గణేష్.


జానపద నృత్య ప్రదర్శనలో యువతులు


జానపద నృత్య ప్రదర్శన చేస్తున్న యువత

మహ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా అద్భుత ఆచారం

కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

కడప కార్పొరేషన్ : మహ్మద్ ప్రవక్త జన్మదిన సందర్భంగా ముస్లిం సోదరులు అద్భుతమైన ఆచారానికి నాంది పలికారని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి అన్నారు. మిలాద్ ఉన్ నబీ సందర్భంగా గురువారం స్థానిక 30వ డివిజన్‌లోని నాయక్ సాహెబ్ వీధిలో వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్, ఎన్ఆర్ఐ గ్రూప్ ఆధ్వర్యంలో బార్శీ ఫాతేహా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డితోపాటు మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషాలు హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అవినాష్‌రెడ్డి మాట్లాడుతూ 40 ఏళ్ల వయసులోనే మహ్మద్ ప్రవక్త అద్భుతమైన ప్రసంగాలు, పనులు చేశారని, ఆయన ఎంచుకున్న మార్గం, ఉద్బోధించిన బోధనలు అనుసరణీయమన్నారు. ప్రవక్త జన్మదిన సందర్భంగా ముస్లిం సోదరులు ఒక మాసం పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారని, ఇది అద్భుతమైన ఆచారమని తెలిపారు. ఈ సేవా స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్ఆర్ఐలు అన్సర్, గయాజ్, 30వ డివిజన్ కార్పొరేటర్ ఎస్ఎండీ షఫీ, తోటక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.


బార్శీ ఫాతేహా కార్యక్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

రూ.11.50లక్షల ఎంపీ నిధులతో బోర్లు ప్రారంభం

కడప నగరంలోని నాయక్ సాబ్ వీధి, బాదుల్లా మఖాన్, కోటిరెడ్డి ఉమెన్స్ కళాశాల సమీపంలో రూ.11.50లక్షల ఎంపీ నిధులతో ఏర్పాటు చేసిన మూడు బోర్లను ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రారంభించారు. 30వ డివిజన్‌లో తాగునీటి సమస్య తీర్చడానికి స్థానిక కార్పొరేటర్ షఫీ, ప్రజల అభ్యర్థన మేరకు ఈ బోర్లు వేశామని ఎంపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబు, వైఎస్సార్‌సీపీ గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్ పాల్గొన్నారు.

కంప్యూటర్ ఆపరేటర్ చేతివాటం

- చాపాడు ఎంపీడీఓ కార్యాలయంలో వెలుగు చూస్తున్న అక్రమాలు
- ఇటీవల రూ.5లక్షలు స్వాహా చేసిన తాత్కాలిక కంప్యూటర్ ఆపరేటర్

చాపాడు : స్థానిక మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో పని చేస్తున్న తాత్కాలిక కంప్యూటర్ ఆపరేటర్ పంచాయతీలలో జరిగిన పనులకు బిల్లులు పెట్టే క్రమంలో చేతి వాటం ప్రదర్శించి రూ.5లక్షలకు పైగా స్వాహా చేశాడు. దీనిపై పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ క్రమంలో ఒక్కసారిగా పంచాయతీ కార్యదర్శులందరూ ఉలిక్కిపడి తమ పంచాయతీల ఖాతాల్లోని నిధులు చెక్ చేసుకుంటున్నారు. రూ.5లక్షలు స్వాహా చేసిన ఘటనపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు. ఇంత జరుగుతున్నా కూడా అధికారుల్లో ఎలాంటి మార్పు రాలేదు. దీనికి నిదర్శనంగా ఎంపీడీఓ కార్యాలయంలో పని చేస్తున్న సీఎఫ్ఎంఎస్ బిల్లులు ఆన్‌లైన్ చేయటంలో ప్రావీణ్యం కలిగిన అటెండర్ శ్రీను పంచాయతీ బిల్లుల వ్యవహారం తిరిగి కొనసాగిస్తున్నారు. గత కొన్నేళ్లుగా ఈ అటెండర్ తన విధులను పక్కన పెట్టి పూర్తిగా కంప్యూటర్ పనులు చేపడుతున్నాడు. ఇటీవల అవినీతి జరిగినప్పటికీ కొందరు పంచాయతీ కార్యదర్శులే దగ్గరుండీ అటెండర్ చేత బిల్లులు పెట్టించుకోవటం గమనార్హం. కొన్ని రోజుల క్రితం బద్రిపల్లె పంచాయతీకి సంబంధించిన లక్ష రూపాయల బిల్లును అధికారుల దృష్టికి తీసుకురాకుండానే సర్పంచ్ ఖాతాకు మళ్లించినట్లు తెలిసింది. ఇదే క్రమంలో మరికొన్ని పంచాయతీల సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులతో నేరుగా సంబంధాలు పెట్టుకుని బిల్లులు చేయించే పనుల్లో నిమగ్నమయ్యాడు. కార్యాలయంలో పర్మినెంటు ఉద్యోగి ఉన్నప్పటికీ గత కొన్నేళ్లుగా తాత్కాలిక కంప్యూటర్ ఆపరేటర్, అటెండర్ మాత్రమే ఇలాంటి పనులు చేస్తున్నా మండల స్థాయి అధికారులు పట్టించుకోవడం లేదు. తాత్కాలిక కంప్యూటర్ ఆపరేటర్ చేసిన బిల్లులతో పాటు అటెండర్ చేసిన బిల్లులపై విచారణ చేపడితే మరింత అవినీతి బయటపడే అవకాశం ఉంటుంది.


ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం అటెండర్ చేత బిల్లులు చేయిస్తున్న చియ్యపాడు పంచాయతీ కార్యదర్శి

కొరవడిన క్రీడాస్ఫూర్తి

ఎస్‌జీఎఫ్ క్రీడాఎంపికల్లో దూషణల పర్వం

కడప స్పోర్ట్స్ : క్రమశిక్షణ, కఠోర సాధనతో క్రీడాకారులు ఉన్నత శిఖరాలు చేరుకుంటారు. అలాంటి క్రీడాకారులకు మార్గదర్శకంగా నిలవాల్సిన వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్‌జీఎఫ్ ఎంపికల్లో తమస్థాయి మరిచిపోయి దూషణల పర్వం కొనసాగించారు. కడప నగరంలోని వైఎస్ఆర్ ఇండోర్ స్టేడియంలో ఎస్‌జీఎఫ్ జిల్లాస్థాయి జూడో క్రీడా ఎంపికలు నిర్వహించారు. అండర్-14, అండర్-17 బాలబాలికల విభాగాల్లో నిర్వహించిన ఈ ఎంపికల్లో వివాదం నెలకొంది. ఎంపికల ప్రక్రియ బాధ్యులు నిబంధనల ప్రకారం ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు క్రీడాదుస్తులతో హాజరుకావాలని, లేని పక్షంలో అనుమతించమని పేర్కొనడంతో వివాదం మొదలైంది. పల్లె ప్రాంతాల నుంచి వచ్చే క్రీడాకారులు ఇప్పటికప్పుడు జూడో క్రీడకు సంబంధించిన క్రీడాదుస్తులు ఎక్కడి నుంచి వస్తాయంటూ మరో వర్గం వ్యాయామ ఉపాధ్యాయులు ప్రశ్నించారు. అన్ని క్రీడలకు క్రీడాదుస్తులు ఉంటేనే అనుమతిస్తున్నారా అంటూ ప్రశ్నించారు. మిగతా క్రీడలు వేరు.. జూడో క్రీడకు మాత్రం కచ్చితంగా క్రీడాదుస్తులు ఉండాలంటూ నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ క్రమంలో మహిళా వ్యాయామ ఉపాధ్యాయుల మధ్య డ్రస్‌ల విషయమై వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో కొద్దిసేపు గందరగోళం నెలకొనడంతో పాటు ఎంపికలు నిలిచిపోయాయి. గట్టిగా కేకలు వేస్తున్న కొందరు వ్యాయామ ఉపాధ్యాయులను బయటికి వెళ్లిపోవాలంటూ ఎస్‌జీఎఫ్ సెక్రటరీ కోరడంతో వ్యాయామ ఉపాధ్యాయులు ఎంపికలను బాయ్‌కాట్ చేసి బయటికి వెళ్లిపోయారు. దీంతో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో వ్యాయామ ఉపాధ్యాయ సంఘ నాయకులు జోక్యం చేసుకుని ఎస్‌జీఎఫ్ సెక్రటరీతో సదరు ఉపాధ్యాయులకు సారీ చెప్పించడంతో పాటు గ్రామీణ క్రీడాకారులను దృష్టిలో ఉంచుకుని క్రీడాదుస్తులు లేకపోయినా అనుమతించేందుకు అంగీకరించడంతో తిరిగి ఎంపికల ప్రక్రియకు వారంతా హాజరయ్యారు. దీంతో ఇరువర్గాల నుంచి లిఖితపూర్వకంగా రాయించుకుని ఎంపికలను ప్రక్రియను నిర్వహించినటట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ బి.అరుణకుమారి తెలిపారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు పాల్గొన్నారు.


జిల్లా జూడో జట్టుకు ఎంపికైన అండర్-14, అండర్-17 బాలికలు

జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు..
అండర్-14 బాలికలు : భారతి, ద్యాక్షి, ముస్కాన్, సాత్విక, యామిని, ప్రణీత.
అండర్-17 బాలికలు: ఎల్. నవనీత, బి.వెంకటలక్ష్మి, వి.వెంకటసుధ, ఎన్.మాధుని, ఎస్. ఆబిద, ఎస్.జె. గీతిక, కె. వెంకటలక్ష్మి, ఎస్. సబీహ, పి. షణ్ముఖప్రియ.
అండర్-14 బాలురు: శ్రీహరి, హవిన్, కిరణ్, పవన్ కుమార్, జయంత్, వెంకటేష్, వెంకటమహిధర్.
అండర్-17 బాలురు : కె.సంతోష్, టి. ఈశ్వర్, గోవర్ధన్, విజయకుమార్, విష్ణువర్ధన్, శివకృష్ణ, జాఫర్‌హుస్సేన్, గోవింద్, చరణ్‌తేజ, చెన్నకేశవ.

మద్యం తాగి బైకు నడిపిన వ్యక్తికి జైలు

కడప అర్బన్ : మద్యం తాగి మోటార్ సైకిల్ నడుపుతూ పోలీసుల తనిఖీల్లో పట్టుబడిన వ్యక్తికి కడప ఫస్ట్ స్పెషల్ జేఎస్‌సీఎం కోర్టు 7 రోజుల జైలుశిక్షతో పాటు, రూ. 3వేలు జరిమానా విధించింది. అల్ల రమేష్‌రెడ్డి ఈనెల 18న మద్యం తాగి మోటార్ సైకిల్ నడుపుతూ కడప ట్రాఫిక్ పోలీసులు బ్రీత్ ఎనలైజర్ సహాయంతో తనిఖీ నిర్వహించగా పట్టుబడ్డాడు. దీంతో ట్రాఫిక్ సీఐ డి.కె జావీద్ కేసు నమోదు చేశారు. విచారణలో సాక్ష్యాధారాలతో నేరం రుజువు కావడంతో ఫస్ట్ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్‌క్లాస్ కోర్టు మెజిస్ట్రేట్ మంగళగౌరీ శిక్ష విధించినట్లు కడప ట్రాఫిక్ సీఐ తెలిపారు.

పోస్టుమాస్టర్‌పై ఫిర్యాదు

కాశినాయన : మండలంలోని నరసాపురం పోస్టు మాస్టర్‌పై ఖాతాదారులు నరసాపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఖాతాదారులకు చెందిన దాదాపు రూ.20 లక్షల నగదును దారి మళ్లించారు. ఖాతాదారుల పుస్తకాల్లో జమ చేస్తూ పోస్టాఫీసు రికార్డుల్లో జమచేయలేదు. ఈ విషయం జిల్లా పోస్టల్ అధికారులకు ఖాతాదారులు తెలియజేయడంతో పది రోజుల క్రితం పోస్టాఫీసుకు వచ్చి విచారణ చేపట్టారు. అవకతవకలు జరిగింది వాస్తవమేనని, పూర్తి విచారణ చేపడతామన్నారు. అయితే పోస్టుమాస్టర్ నాయక్ సెలవులో వెళ్లారు. దీంతో ఖాతాదారులు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

జూదరుల అరెస్టు

దువ్వూరు : దువ్వూరు మండలం కృష్ణంపల్లె గ్రామ సమీప పొలాల్లో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్టు ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు. గురువారం దువ్వూరు పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ జూదమాడుతున్న వారి వద్ద నుంచి 52 పేక ముక్కలు, రూ.17,400 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

రిమ్స్ మార్చురీలో గుర్తు తెలియని మహిళ మృతదేహం



కడప అర్బన్ : కడప ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (రిమ్స్) మార్చురీలో గుర్తు తెలియని మహిళ మృతదేహం ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈమెను వైఎస్ఆర్ జిల్లా బి.మఠంకు చెందిన రాములమ్మ అనే చిరుమామాతో ఈనెల 5న రిమ్స్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. ఆమెకు సంబంధించిన వారు తగిన ఆధారాలతో తమను సంప్రదించాలని రిమ్స్ అధికారులు కోరారు.

తిరుమల మహాప్రసాదంపై చంద్రబాబు వ్యాఖ్యలు దుర్మార్గం

టీటీడీ బోర్డు మాజీ సభ్యులు ఎస్. యానాదయ్య, మాసీమ బాబు

కడప కార్పొరేషన్ : తిరుమల మహాప్రసాదాన్ని అవమానించేలా, కించపరిచేలా ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యాఖ్యలు చేయడం అత్యంత దుర్మార్గమని తిరుమల, తిరుపతి దేవస్థానం మాజీ సభ్యులు ఎస్. యానాదయ్య, మాసీమ బాబు అన్నారు. గురువారం స్థానిక వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా తిరుమల వెంకటేశ్వరస్వామికి ఎంత పవిత్రత ఉందో, అక్కడ లభించే మహాప్రసాదానికి అంతే పవిత్రత ఉందన్నారు. ఆ ప్రసాదంలో కల్తీ జరిగిందని, జంతువుల కొవ్వు నూనెగా ఉపయోగించారని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోపణలు చేయడం దుర్మార్గమన్నారు. వెంకటేశ్వరస్వామి గుడిలో పురాణం గోడౌన్‌లో ప్రసాదం కోసం వినియోగించే నెయ్యి, ఇతర పదార్థాలు క్వాలిటీ చెకప్ చేసి అందులో భద్రపరుస్తారని, పోటులో వైష్ణవుల ఆధ్వర్యంలో లడ్డులు, కైంకర్యాలు తయారు చేస్తారన్నారు. బోర్డు సభ్యులకు, అధికారులకు వీటికి ఎలాంటి సంబంధం ఉండదన్నారు. చిన్నజీయర్ స్వామి, పెద్ద జీయర్ స్వామి, ఆగమ సలహాదారులు, ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో ఇక్కడ పూజలుగానీ, ప్రసాదాల తయారీగానీ అత్యంత పవిత్రంగా జరుగుతాయన్నారు. స్వచ్ఛమైన ఆవునెయ్యిని నాణ్యత తనిఖీ చేసి వినియోగిస్తారని, రసాయన మందులు ఉపయోగించని గింజలను ఉపయోగిస్తారన్నారు. కోట్లాది మంది ఎంతో పవిత్రంగా స్వీకరించే తిరుమల మహాప్రసాదాన్ని అనుమానించేలా వ్యాఖ్యలు చేయడం అత్యంత నీచమన్నారు. చంద్రబాబుకు ఏమాత్రం నిజాయితీ ఉన్నా వెంటనే హిందువులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ బోర్డు మాజీ సభ్యులు ఎస్. యానాదయ్య, మాసీమ బాబు

యువకుడి ఆత్మహత్యాయత్నం

కడప అర్బన్ : రాష్ట్ర ప్రభుత్వం 2022లో విడుదల చేసిన పోలీసు ఉద్యోగ నోటిఫికేషన్ కొనసాగించలేదనే కారణంతో ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించిన సంఘటన కడప నగరంలో జరిగింది. వివరాలు ఇలా.. కడప నగరం పాతకడపకు చెందిన భవనాసి ప్రదీప్ (26)కు తండ్రి గంగాధర్ ఇప్పటికే మృతి చెందాడు. తల్లి రత్నకుమారి కూలిపని చేస్తోంది. చెల్లెలు పల్లవి పీజీ చదువుతోంది. ప్రదీప్ 2022లో కానిస్టేబుళ్ల ఉద్యోగాల నోటిఫికేషన్ విడుదల కావడంతో దరఖాస్తు చేసుకున్నాడు. ప్రాథమిక పరీక్ష రాశాడు. ఈ నేపథ్యంలో హోంగార్డులు తమకు రిజర్వేషన్ కల్పించాలని కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ఆగిపోయింది. ఈ నేపథ్యంలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం నూతన నోటిఫికేషన్ విడుదల చేయడం గానీ, పాత నోటిఫికేషన్‌ను కొనసాగించడం కానీ చేయలేదు. దీంతో తీవ్ర ఆవేదనకు గురైన యువకుడు ఈనెల 17న కడప ఆర్ట్స్ కాలేజీ సమీపంలో ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ప్రస్తుతం రిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు.


ఆత్మహత్యకు యత్నించిన యువకుడు ప్రదీప్

ఎంబీబీఎస్ ఫస్ట్ ఇయర్ ఫలితాలు విడుదల

కడప అర్బన్ : కడప ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల (రిమ్స్)లో 2023-24 సంవత్సరానికి ఫస్ట్ ఇయర్ ఎంబీబీఎస్ చదువుతున్న విద్యార్థుల పరీక్ష ఫలితాలు విడుదల చేశారు. వీరిలో ముగ్గురు డిస్టింక్షన్ సాధించారు. 68 మంది విద్యార్థులు ఫస్ట్ క్లాస్‌లో, 97 మంది విద్యార్థులు ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించారు.

నూతన వైద్య విద్యార్థుల అడ్మిషన్‌లు

ప్రభుత్వ వైద్య కళాశాల కడపలో 2024- 25 సంవత్సరానికి వైద్య విద్య అభ్యసించేందుకు నీట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధించి ర్యాంకులు పొంది కడప రిమ్స్‌ను కౌన్సెలింగ్‌లో ఎంచుకున్న 139 మంది విద్యార్థులు గురువారం అడ్మిషన్‌లు పూర్తి చేసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన కోటా 139 మందితో ముగిసింది. జాతీయ స్థాయిలో కేటాయించిన 26 వైద్యవిద్య సీట్ల భర్తీకి శుక్రవారం నుంచి అడ్మిషన్‌ల ప్రక్రియ నిర్వహించనున్నారు. అలాగే వివిధ కేటగిరిలకు కేటాయించిన 10 సీట్లు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. దీంతో కడప ప్రభుత్వ వైద్య కళాశాల (రిమ్స్)కు కేటాయించిన 175 సీట్లలో 139 సీట్ల భర్తీ ప్రక్రియ ముగిసింది. మిగతా 36 సీట్లు త్వరలో భర్తీ చేయనున్నారు. ఈ సందర్భంగా కడప రిమ్స్ ప్రిన్సిపాల్, అడిషనల్ డీఎంఈ డాక్టర్ ఎ. సురేఖ మాట్లాడుతూ మెరుగైన ఫలితాలను సాధించేందుకు కృషి చేసిన అధ్యాపకులను, వైద్య సిబ్బందిని అభినందించారు.

బీజేపీ నాయకులు క్షమాపణ చెప్పాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : పార్లమెంటు ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ నాయకులు తక్షణమే క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఎన్‌డీ విజయ జ్యోతి డిమాండ్ చేశారు. రాహుల్ గాంధీపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ పార్టీ నేతలతో కలిసి ఆమె నగరంలోని ఇందిరాగాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాహుల్ గాంధీని చంపాలని బీజేపీ నాయకులు మాట్లాడుతున్నారని, ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నా మోడీ, అమిత్‌షాలు ప్రేక్షక పాత్ర పోషించడం దారుణమన్నారు. ఈ దేశానికి స్వాతంత్ర్యం తెచ్చింది, త్యాగాలు చేసింది కాంగ్రెస్ పార్టీయేనని తెలిపారు. రాహుల్ గాంధీని తీవ్రవాది అంటున్న నేతలకు రాహుల్ అమ్మమ్మ ,నాన్న ఇద్దరు తీవ్రవాదుల చేతుల్లో బలి అయ్యారనే విషయం తెలియదా అని ప్రశ్నించారు. అనంతరం జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేశారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు అఫ్జల్ ఖాన్, పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి, అబ్దుల్ సత్తార్, ధ్రువ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మూడు వాహనాలను ఢీకొట్టి పరారైన డ్రైవర్

అట్లూరు : మద్యం మత్తులో మూడు వాహనాలను ఢీకొట్టి పోలీసులు వెంబడించడంతో తాను నడుపుతున్న వాహనాన్ని వదిలి డ్రైవర్ పరారైన ఘటన అట్లూరు మండలంలో గురువారం రాత్రి జరిగింది. స్థానికులు, ఎస్ఐ రామకృష్ణయ్య వివరాల మేరకు ఏపీ39 ఏఈ 5758 నంబరు గల ఆయిల్ ట్యాంకర్ భాకరాపేట హిందుస్థాన్ పెట్రోలియం గోడౌన్ నుంచి ఆయిల్ నింపుకుని బద్వేలు మీదుగా పాదిలికి వెళుతుండగా అట్లూరు మండలం లింగాలకుంట సమీపానికి వచ్చేసరికి బద్వేలు వైపు నుంచి కడప వైపు ఏపీ04 టీఎక్స్ 0519 నంబరు గల లారీ ఆయిల్ ట్యాంకర్‌ను ఢీకొట్టి ఆపకుండా వెళ్లిపోయింది. ఇదే లారీ బాలిరెడ్డిబాయి సమీపంలో మరో ఆటోను ఢీకొంది. ముందుగా ఢీకొన్న ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంబంధిత లారీని ఎస్ఐ తన సిబ్బందితో వెంబడించగా పోలీసు వాహనాన్ని కూడా ఢీకొట్టి లారీని వదిలేసి డ్రైవర్ పరారయ్యాడు. డ్రైవర్ వదలి వెళ్లిన లారీని పోలీసు స్టేషన్‌కు తరలించి డ్రైవర్ కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

అధికార పార్టీనా..మజాకా!

- ప్రొటోకాల్ లేని అధికార పార్టీ నేతతో పెట్రోలు బంకు ప్రారంభం
- ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బహిష్కరించిన వైఎస్సార్‌సీపీ చైర్మన్, వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : రాష్ట్రంలో అధికారం మారింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలు సైతం ఎలాంటి అధికారిక హోదా లేనప్పటికీ తమ ద్వారానే జరగాలని టీడీపీ నేతలు పట్టుబడుతున్నారు. ఈ కోవలోనే బద్వేలు పురపాలక సంఘం ఆధ్వర్యంలో మైదుకూరు రోడ్డులో ఏర్పాటు చేసిన పెట్రోలు బంకును ఎలాంటి అధికారిక హోదా లేని టీడీపీ నియోజకవర్గ యువ నాయకుడు రితీష్‌రెడ్డి ప్రారంభించారు. మున్సిపల్ అధికారులు సైతం ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేసి తమ స్వామిభక్తిని చాటుకున్నారు. అయితే అధికారుల ఏకపక్ష నిర్ణయాల కారణంగా వైఎస్సార్‌సీపీకి చెందిన మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బహిష్కరించారు.

గతంలో పలుమార్లు వాయిదా

కేవలం పన్నుల రూపంలో వచ్చే ఆదాయం మినహా ఎటువంటి ఆదాయం లేని బద్వేలు మున్సిపాలిటీకి ఆదాయ వనరులు సమకూర్చుకునేందుకు ప్రస్తుత మున్సిపాలిటీ వైఎస్సార్‌సీపీ పాలకవర్గం పురపాలక సంఘం ఆధ్వర్యంలో పెట్రోలు బంకు ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం స్థానిక మైదుకూరు రోడ్డులోని పాత గుంతపల్లె పంచాయతీ కార్యాలయం స్థలంలో పెట్రోలు బంకు ఏర్పాటుకు స్థలం కేటాయిస్తూ కౌన్సిల్‌లో తీర్మానం చేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణలు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధల సహకారంతో జిల్లా స్థాయి ఉన్నతాధికారుల నుంచి అన్ని రకాల ఎన్‌ఓసీలు పొంది హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థతో ఒప్పందం చేసుకుంది. ఈ మేరకు సంస్థ ప్రతినిధులు సుమారు రూ.1.50 కోట్ల వ్యయంతో పెట్రోలు బంకును నిర్మించారు. ఈ ఏడాది జూలై నెల 7న పెట్రోలు బంకును ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినప్పటికీ టీడీపీ నేతల ఆదేశాల మేరకు ప్రారంభోత్సవాన్ని వాయిదా వేశారు. తిరిగి ఈ ఏడాది ఆగస్టు 15న మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్.ఎం.డి.ఫరూక్‌తో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయగా నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ సుధ, ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డిలు సిద్ధంగా ఉన్నప్పటికీ చివరి క్షణంలో వాయిదా వేశారు.


పెట్రోలు బంకును ప్రారంభిస్తున్న టీడీపీ యువ నాయకుడు రితీష్‌రెడ్డి

స్వామిభక్తి చాటిన మున్సిపల్ అధికారులు

బద్వేలు పురపాలక సంఘం పెట్రోలు బంకు ప్రారంభోత్సవ తేదీని పురపాలక సంఘం కౌన్సిల్ సభ్యులతో గాని, నియోజకవర్గ ఎమ్మెల్యేతో గాని, అధికారిక హోదా కలిగిన ఎమ్మెల్సీతో గాని చర్చించకుండానే మున్సిపల్ అధికారులు ఖరారు చేశారు. జిల్లాకు చెందిన మంత్రి రాంప్రసాద్‌రెడ్డితో ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు, వైఎస్సార్‌సీపీ చైర్మన్, వైస్‌చైర్మన్, కౌన్సిల్ సభ్యులకు ఒకరోజు ముందు సమాచారం ఇచ్చారు. అయితే ముందస్తు షెడ్యూలు కార్యక్రమాలు ఉండటంతో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అందుబాటులో లేరు. ఇదే సమయంలో మున్సిపల్ అధికారులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీకి చెందిన మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్లు, కౌన్సిలర్లు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బహిష్కరించారు. అధికార పార్టీ నేతల మెప్పు కోసం పాకులాడుతున్న మున్సిపల్ అధికారులు ఎలాంటి అధికారిక హోదా లేని టీడీపీ నేత రితీష్‌కుమార్‌రెడ్డితో పెట్రోలు బంకును ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేయగా ఆయన టీడీపీ కౌన్సిలర్లతో కలిసి బంకును ప్రారంభించారు.

సమాధానం దాటవేత

పెట్రోలు బంకును ఎలాంటి అధికారిక హోదా లేని టీడీపీ నేత ప్రారంభించిన విషయంపై మున్సిపల్ కమిషనర్ వి.వి.నరసింహారెడ్డిని వివరణ కోరగా సమాధానం దాటవేస్తూ వెళ్లిపోయారు.